కార్యకర్తలంతా ఐక్యంగా పనిచేయాలి

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి: తెలుగుదేశం పార్టీ కార్యకర్తలంతా పార్టీ విజయం కోసం కలిసికట్టుగా పనిచేయాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, టెక్కలి శాసనసభ్యులు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో ఉన్న అచ్చెన్నను టిడిపి నాయకులు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో టిడిపి కార్యకర్తలు చిన్నిచిన్న విభేదాలతో విడిపోయి పనిచేయటం వల్ల పార్టీ నష్టపోతుందని, ఏదైన సమస్య ఉంటే తనకు తెలియజేస్తే ఆ సమస్య పరిష్కరిస్తానన్నారు. అలా కాకుండా విడిపోవడం వల్ల పక్క పార్టీ లాభపడుతుందని, అందుకే అందరూ కలిసి కట్టుగా పార్టీ విజయం కోసం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో హరిశ్చంద్రపురం టిడిపి నాయకులు హనుమంతు అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన రీ సర్వే

భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రీ సర్వే ప్రక్రియ చేపడుతోంది. తొలుత ప్రయోగాత్మకంగా రెవెన్యూ డివిజన్ పరిధిలో ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి రీ సర్వే పూర్తి చేశారు. ప్రస్తుతం జిల్లాలో మరికొన్ని రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేసి సర్వే చేస్తున్నారు. ఇప్పటికే 350 గ్రామాలు మ్యాపింగ్ దశకు చేరుకున్నట్లు అధికారులు చెప్తున్నారు. వాస్తవానికి క్షేత్రస్థాయి సమస్యల వల్ల రీ సర్వేకు అడుగడుగునా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రోవర్స్ సరిగా పనిచేయకపోవడం, సరిహద్దుల నిర్ణయించడంలో సమస్యలతో సర్వే నత్తనడకన సాగుతోంది. రెవెన్యూ, సర్వే శాఖల సమన్వయంతో చేపట్టిన రీ సర్వే వేగవంతం చేయాలన్న లక్ష్యం తప్ప క్షేత్రస్థాయి ఇబ్బందులు పరిగణనలోకి తీసుకోలేదన్న వాదన ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది.

- వెంటాడుతున్న సాంకేతిక సమస్యలు
- మొరాయిస్తున్న రోవర్స్
- ఉద్యోగులపై పెరిగిన ఒత్తిడి
- భూముల కొలతల్లో దొర్లుతున్న తప్పులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని 30 మండలాల పరిధిలో 1466 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఇందులో 9,86,092.82 ఎకరాల విస్తీర్ణం మేర భూమి ఉంది. ఇందులో ఇప్పటివరకు 350 రెవెన్యూ గ్రామాల పరిధిలో 1,40,775.13 ఎకరాల విస్తీర్ణంలో సర్వే పూర్తయినట్లు అధికారులు చెప్తున్నారు. గ్రామ సరిహద్దు నిర్ణయించడం, డ్రోన్‌తో సర్వే చేయడం, ప్రభుత్వ భూమి గుర్తించడం, రైతుల భూముల సరిహద్దులను నిర్ధారించి భూ హక్కు పత్రాలు తయారు చేసి కొత్తగా ముద్రించి ఇవ్వాలన్నదే ఈ ప్రక్రియ ముఖ్య ఉద్దేశం. క్షేత్రస్థాయిలో గ్రామ సచివాయాల్లో పనిచేస్తున్న రెవెన్యూ కార్యదర్శి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయకుల నెత్తిన ఈ సర్వే భారాన్ని మోపి వేగంగా పూర్తి చేసేందుకు నిరంతరాయంగా ఒత్తిడి చేస్తున్నారు. సుశిక్షితులైన సిబ్బంది లేకపోవడం, పరికరాల కొరత, మౌలిక వసతుల సమస్యల వల్ల రీ సర్వే అనుకున్నంత సజావుగా ముందుకు సాగడం లేదని తెలుస్తోంది. భూ రికార్డుల స్వచ్ఛీకరణ సమగ్రంగా చేపట్టిన తర్వాత డ్రోన్‌లతో చిత్రీకరిస్తే ప్రయోజనం ఉంటుంది. అందుకు విరుద్ధంగా రెవెన్యూ రికార్డులు, గ్రామాల్లో కొందరు రైతులు చెప్తున్న సమాచారం ఆధారంగా రీ సర్వే చేస్తున్నట్లు తెలుస్తోంది. రెవెన్యూ రికార్డుల్లో చాలావరకు పాత వివరాలు ఉండడం, విస్తీర్ణంలో తేడాలు, నవీకరణ కాకపోవడం వంటి సమస్యలు వెంటాడుతున్నాయి. దీనికితోడు గ్రామంలో ప్రభుత్వ భూములైన డొంకలు, చెరువులు, కాలువలు, శ్మశానం వంటి వాటిని గుర్తించి సరిహద్దులు కొలిచి నిర్ధారించిన వెంటనే రాళ్లు పాతాల్సి ఉంది. ఇంతవరకు గ్రామాల్లో రాళ్లు అందుబాటులో లేవు. సర్వే చేసిన సమయంలో గుర్తులు పెట్టి తర్వాత పాతేందుకు సమస్యలు వస్తున్నాయి. సర్వే రాళ్లు ముందస్తుగా సరఫరా లేక కొండగుర్తుల పైనే ఆధారపడాల్సి వస్తోంది. డ్రోన్ సర్వేకు ఎంపిక చేసిన ఏజెన్సీలు డ్రోన్లతో చిత్రాలు తీసి ఒఆర్‌ఐ (ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజ్) తయారు చేస్తారు. వీటి ఆధారంగా భూమి పైన రైతు పొలాల సరిహద్దులను గుర్తించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

సరిహద్దుల నిర్ణయంలో ఇబ్బందులు

డ్రోన్ ద్వారా తీసిన చిత్రం ఆధారంగా రోవర్ (డిజిపిఎస్)తో ప్రతి పొలం కొలిచి హద్దులు నిర్ధారిస్తున్నారు. డ్రోన్ చిత్రంలో కనపడని భూముల్లో హద్దులను నిర్ణయించడం కష్టమవుతోంది. రోవర్లతో కొలిచి హద్దులు నిర్ణయిస్తున్నా, అందులో కచ్చితత్వం కనబడడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. భూమి పరిశీలన తర్వాత భూమిని నిర్ధారించేందుకు భూమి పైకి వెళ్లకుండా, రైతులకు తగినంత సమయం ఇవ్వకుండానే 9(2) నోటీసులు ఇస్తున్నారు. వీటిని ఆధారంగా చేసుకుని 13 ప్రకటన ఇచ్చి సర్వే, రెవెన్యూ సిబ్బంది పని పూర్తి చేస్తున్నారు. దీనివల్ల సొంత గ్రామాలకు దూరంగా ఉన్న రైతులు పలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

క్షేత్రస్థాయి సిబ్బందిపై ఒత్తిడి

రీ సర్వేలో గ్రామ సర్వేయరు, గ్రామ రెవెన్యూ అధికారులదే కీలకపాత్ర. విఆర్‌ఒలకు రీ సర్వేపై అవగాహన లేక అన్ని వ్యవహారాలు గ్రామ సర్వేయర్ల పైనే భారం వేస్తున్నారు. దీంతో ఒక్కో సచివాలయం సర్వేయరుకు సమీపంలో ఉన్న సచివాలయం నుంచి సహకారం తీసుకుంటున్నారు. అక్కడ పని ఉన్న రోజున రీ సర్వేకు బ్రేక్ పడుతోంది. దీంతో గ్రామ సర్వేయర్లు పని ఒత్తిడితో సతమతమవుతున్నారు. ఉప తహశీల్దారు, తహశీల్దారు, ఆర్డీవో తదితర ఉన్నతాధికారులు మరింత ఒత్తిడి పెంచడం, వీడియో కాన్ఫరెన్స్‌లకు హాజరవడం తప్ప గ్రామాల్లో సందర్శించిన దాఖలాలు కనిపించడం లేదు.

సర్వే రాళ్లు పాతడంలోనూ ఇబ్బందులే

సర్వే రాళ్ల కోసం జిల్లాకు రూ.20 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేసింది. ఎ-క్లాస్ రూ.50, బి-క్లాస్ కోసం రూ.36 చొప్పున ఖర్చు చేయాలని దిశానిర్దేశం చేసింది. గతంలో పైలట్ గ్రామాల్లో వీటి రవాణాతో పాటు పొలాల్లోకి మోసుకెళ్లేందుకు ఒక్కో దానికి రూ.100 నుంచి రూ.130 వరకు ఖర్చు చేసినట్లు అధికారులు చెప్తున్నారు. కొన్నిచోట్ల రైతులతో వీటిని మోయిస్తున్నారు. మరోవైపు రోవర్సు మొరాయించడం వల్ల పలుచోట్ల సర్వేకు బ్రేక్ పడింది.

శాస్త్రీయ విజ్ఞానంతో అశాస్త్రీయ ప్రచారం

- మనుధర్మ ప్రచారానికి అడ్డుకట్ట వేయాలి
- ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు

మాట్లాడుతున్న రచయిత అప్పలనాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

మనుధర్మ శాస్త్ర ప్రచారకులు శాస్త్రీయ విజ్ఞానాన్ని వాడుకుంటూ అశాస్త్రీయ భావనలను ప్రచారం చేస్తున్నారని ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు విమర్శించారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన గురజాడ 107 వర్ధంతి సభలో ప్రధాన వక్తగా ఆయన మాట్లాడారు. శాస్త్ర విజ్ఞాన ఫలితాలైన టెలివిజన్, సోషల్ మీడియాను వాడుకుంటూ మనువాదులు మూఢ నమ్మకాలు, అశాస్త్రీయ భావాలు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. పరమత ద్వేష ప్రచారం చేస్తూ సమాంతర అధికారంతో చెలరేగిపోతున్నారని, వీటికి అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత కవులు, రచయితలపై ఉందన్నారు. శాస్త్ర సమాజాన్ని వెయ్యేళ్లు వెనక్కి నెట్టేయాలని చూస్తున్నారని విమర్శించారు. నిచ్చెన మెట్ల కుల వ్యవస్థను సమాజంపై రుద్దుతూ సమాంతర అధికారంతో మనుధర్మ శాస్త్ర ప్రచారకులు విజృంభిస్తున్నారన్నారు. గురజాడ పేరిట పురస్కారాన్ని ఆధ్యాత్మికవాది అయిన చాగంటి కోటేశ్వరరావుకు ఇవ్వడం సమంజసం కాదన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు చీకటి దివాకర్ మాట్లాడుతూ ఆధునిక మహిళ చరిత్ర తిరగరాస్తుందన్న గురజాడ చెప్పిన మాటలు నేడు నిజమవుతున్నాయన్నారు. సమాజంలో నేడు మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని తెలిపారు. అంటరానితనాన్ని, కుల వివక్షను తీవ్రంగా నిరసించిన మహాకవి గురజాడ అని కొనియాడారు. ఇప్పటికీ మహిళలు, దళితులపైన దాడులు, అత్యాచారాలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గురజాడ చూపిన బాటలో నడిచి సమాజ మార్పునకు అంతా పనిచేయాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఆచార్యులు ఉదయ్ కిరణ్ అధ్యక్షతన వహించిన సభలో సాహితీ స్రవంతి కన్వీనర్ కె.శ్రీనివాసు ఆహ్వానం పలికారు. కోశాధికారి నెట్టిమి రమణారావు వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.

నేడు మంత్రి జోగి రమేష్ పర్యటన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ బుధవారం జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.15 గంటలకు గార మండలం లింగాలవలస చేరుకుని జగనన్న లేఅవుట్‌ను పరిశీలిస్తారు. 11.15 గంటలకు అక్కడ్నుంచి బయలుదేరి కలెక్టరేట్‌కు చేరుకుంటారు. 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు గృహ నిర్మాణశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. 2.45 గంటల వరకు ఆర్ అండ్ బి అతిథిగృహంలో ఉండి అనంతరం విశాఖపట్నం బయలుదేరి వెళ్తారని తెలిపారు.

క్రీడా స్ఫూర్తితో పతకాలు సాధించాలి

జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వికలాంగుల క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న విజయ

జిల్లా స్థాయి వికలాంగుల ఆటల పోటీలతో పాటు, రాష్ట్ర స్థాయిలోనూ పతకాలు సాధించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ పేర్కొన్నారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ వేడుకల సందర్భంగా వికలాంగుల జిల్లా స్థాయి ఆటల పోటీలు నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో వికలాంగుల శాఖ ఆధ్వర్యాన మంగళవారం వివిధ ఆట పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ఆమె జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. తొలుత క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఆమె మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి వికలాంగులను ప్రోత్సహిస్తూ అనేక సంక్షేమ కార్యకమాలను అమలు చేస్తున్నారని అన్నారు. అందులో భాగంగా జిల్లా స్థాయి ఆటల పోటీలను నిర్వహించడం గర్వకారణమన్నారు. ఈ ఆటల పోటీల్లో సుమారు 200 మంది పాల్గొనడం ఆనందదాయకమన్నారు. గెలుపొందిన విజేతలకు డిసెంబరు 3న ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా బహుమతులు అందించనున్నట్లు వికలాంగుల సంక్షేమశాఖ పీడీ ఎం.కిరణ్‌కుమార్ తెలిపారు. ఇదే క్రీడాస్ఫూర్తితో రాష్ట్రస్థాయిలో ఎంపికై పతకాలు సాధించాలన్నారు. వికలాంగుల సంక్షేమం కోసం అదే రోజున 80 మందికి బ్యాటరీ మెటారు సైకిళ్లను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఆర్థికంగా ఎదిగేందుకు రూ.కోటి వరకు రుణాలు, విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, టచ్ ఫోన్లు, ఇతర పరికరాలను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రీడా పోటీల్లో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎం.మాధురీలత, సెట్‌శ్రీ సిఇఒ బి.వి.ప్రసాదరావు, నెహ్రూ యువక కేంద్రం జిల్లా సమన్వయకర్త కె.వి.ఉజ్వల్, జిల్లా ఉపాధి అధికారి జి.శ్రీనివాసరావు, బెహరా మనోవికాస కేంద్రం డైరక్టరు బెహరా చంద్రశేఖర్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

విభేదాలతో పార్టీకి నష్టం చేయొద్దు

- పదవులతో అందరికీ సమన్యాయం సాధ్యం కాదు
- ఐక్యతతో బలోపేతానికి కృషి చేయాలి
- వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

ప్రజాశక్తి - పలాస

ప్రగతి భవనాన్ని ప్రారంభిస్తున్న ధర్మాన కృష్ణదాస్

నాయకుల మధ్య భేదాభిప్రాయాలు సహజమని, దాన్ని విభేదాలుగా మార్చి పార్టీకి నష్టం చేయొద్దని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. పలాసలో మంత్రి సీదిరి అప్పలరాజు నూతన క్యాంపు కార్యాలయం (ప్రగతి భవన్)ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ పదవులతో అందరికీ సమన్యాయం సాధ్యం కాదన్నారు. పార్టీలో ఉండి క్రియాశీలకంగా లేని నాయకులు, కార్యకర్తలు ముందుకు వచ్చి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఐక్యతగా పనిచేసి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో గెలిచి జగన్‌కు కానుకగా ఇవ్వాలన్నారు. జగన్‌ను ఎదుర్కొనే శక్తి ప్రతిపక్షాలకు లేదన్నారు. మంత్రి అప్పలరాజు రాజకీయాల్లోకి వచ్చినప్పట్నుంచీ ప్రజల కోసమే నిరంతరం పనిచేస్తున్నారని కొనియాడారు. ఈ ప్రాంత అభివృద్ధిపై ముఖ్యమంత్రి జగన్ ప్రత్యేక దృష్టిసారించారని తెలిపారు. రాష్ట్రంలో తటస్థ ఓట్లు అధిక శాతం వైసిపికి అనుకూలంగా ఉన్నాయని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజల మధ్యకు వెళ్తున్న సందర్భంలో స్పష్టమైందన్నారు.

జగన్‌ను శాశ్వత ముఖ్యమంత్రిగా చూసేందుకు కార్యకర్తలంతా కష్టపడి పనిచేయాలని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు పిలుపునిచ్చారు. నియోజకవర్గ ప్రజలకు మరిన్ని సేవలు అందించేందుకు, వైసిపి శ్రేణులకు అండగా ఉండేందుకు ప్రగతి భవన్ కార్యాలయాన్ని ప్రారంభించామని చెప్పారు. పలాస నియోజకవర్గంలో దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. టిడిపి ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలు ప్రజలను రాచిరంపాన పెట్టాయన్నారు. ప్రతి పనికీ రేటును నిర్ణయించి నచ్చిన వారికి ఒకలా, నచ్చని వారికి మరోలా పీల్చి పిప్పి చేశాయని ధ్వజమెత్తారు. వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన నిర్వహించిన సభలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, సాయిరాజ్, నియోజకవర్గ వైసిపి పరిశీలకులు సూర్యరాజు, డిసిసిబి చైర్మన్ కె.రాజేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ పి.వి సతీష్, అగ్రికల్చర్ డైరెక్టర్ మల్లా రవికుమార్, మందస, వజ్రపుకొత్తూరు ఎంపిపిలు డొక్కరి దానయ్య, ఉప్పరపల్లి నీలవేణి ఉదయ్ కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు దువ్వాడ మధుకేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ బోర బుజ్జి, మున్సిపల్ మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రుణాల మంజూరులో అలక్ష్యం వద్దు

- నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలి
- సంక్షేమ పథకాల అమల్లో బాధ్యత వహించాలి
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రైతులకు పంట రుణాలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఎంఎస్‌ఎంఇ రుణాల మంజూరులో కొన్ని బ్యాంకులు అలక్ష్యం వహిస్తున్నాయని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అసహనం వ్యక్తం చేశారు. ఇదేవిధంగా ఇకపై కొనసాగితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించి తీరాల్సిందేనని తేల్చిచెప్పారు. లీడ్ డిస్ట్రిక్ట్ కార్యాలయం ఆధ్వర్యాన జిల్లాస్థాయి బ్యాంకర్ల సమీక్షా సమావేశాన్ని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. పిఎంఇజిపి, పిఎంఎఫ్‌ఎంఇ, టిడ్కో గృహ రుణాలు, జగనన్న తోడు, విద్యా రుణాలు, బ్యాంకు లింకేజీ తదితర అంశాలపై చర్చించిన కలెక్టర్ సంక్షేమ పథకాల అమల్లో బ్యాంకర్లు బాధ్యత వహించాలని కోరారు. రైతులు, మహిళలు, వెనుకబడిన తరగతులకు రుణాల మంజూరులో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. పబ్లిక్, ప్రయివేటు సెక్టార్ బ్యాంకులు, రీజనల్ రూరల్ బ్యాంకులు, సహకార బ్యాంకులు వ్యాపార దృష్టితో అన్నీ చూడరాదన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. బ్యాంకులకు నిర్దేశించిన లక్ష్యాలతో పాటు సాధించిన లక్ష్యాల వివరాలను సమావేశానికి మూడు రోజుల ముందుగానే తీసుకోవాలని ఎల్‌డిఎంను ఆదేశించారు.

లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ జి.వి.బి.డి హరిప్రసాద్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం బ్యాంకుల్లో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 30వ తేదీ వరకు జాతీయ అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. జగనన్న తోడు పథకాన్ని 90 శాతం జిల్లాలో అమలు చేశామన్నారు. గార, ఇచ్ఛాపురంలో శత శాతం పూర్తి చేశామని చెప్పారు. సదస్సుల నిర్వహణలో రాష్ట్రంలో తొలి స్థానంలో ఉన్నామన్నారు. నాబార్డు డిడిఎం వరప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో రూ.7,689.05 కోట్లతో వార్షిక ప్రణాళికను సిద్ధం చేశామన్నారు. వీటిని అమలు చేసే దిశగా బ్యాంకులు సహకరించాలని కోరారు. సమావేశంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ మేనేజర్ బి.కె.వి.ఎస్.ఎస్ గురునాథరావు, ఆర్‌బిఐ ఎల్‌డిఒ ఎస్.అనిల్ కుమార్, డిసిసిబి సిఇఒ డి.వరప్రసాద్, కె.గిరిజాశంకర్, జిల్లా అధికారులు కె.శ్రీధర్, పి.వి శ్రీనివాసరావు, ఐ.ధర్మారావు, ఎం.కిరణ్‌కుమార్, కె.అనంతలక్ష్మి, ఆర్.గడ్డెమ్మ, ఎం.కిషోర్, పలు బ్యాంకుల ప్రాంతీయ మేనేజర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'పరివర్తన'తో జీవితాల్లో వెలుగులు

నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో పరివర్తన 2.0 ద్వారా ఆర్థిక సహాయం పొందుతున్న 34 కుటుంబాల జీవితాల్లో వెలుగులు రావాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. చట్ట విరుద్ధ కార్యకలాపాలు చేస్తూ ఆబ్కారీ శాఖకు పట్టుబడిన వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధి కింద ఆర్థికసాయం అందించే కార్యక్రమాన్ని పోలీసు శాఖ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, డిఆర్‌డిఎ ఆధ్వర్యాన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీతి, నిజాయతీలతో జీవనం సాగించాలన్నారు. జిల్లాలో చట్ట విరుద్ధ కార్యకలాపాలు చేస్తూ 98 మంది పట్టుబడ్డారని తెలిపారు. వీరికి జీవనోపాధి కల్పించడంలో భాగంగా వారు కోరుకున్న వృత్తి, వ్యాపారాల్లో రాణించేందుకు ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. పట్టుబడిన 98 మందిలో ఎనిమిది మందికి పలాస, ఆమదాలవలసలో నిర్వహించిన జాబ్‌మేళాలో ఉద్యోగాలు లభించాయని, 34 మందికి కిరాణా, బట్టలు షాపులు, ఇతరత్రా షాపుల నిర్వహణ కోసం రుణాలు మంజూరు చేసినట్లు వివరించారు. మిగిలిన వారికీ జీవనోపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆబ్కారీ శాఖకు పట్టుబడిన వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధి కింద పలు శాఖల సమన్వయంతో పరివర్తన కార్యక్రమం చేపట్టినట్లు ఎస్‌పి జి.ఆర్ రాధిక తెలిపారు. పరివర్తన 2.0 ద్వారా డిఆర్‌డిఎ, బ్యాంకు, స్త్రీనిధి, సిఐఎఫ్, జగనన్న తోడు కింద రూ.11 లక్షల ఆర్థికసాయాన్ని 34 కుటుంబాలకు అందించినట్లు చెప్పారు. అనంతరం నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ డి.వి విద్యాసాగర్, ఎల్‌డిఎం జి.వి.బి.డి హరిప్రసాద్, నాబార్డు డిడిఎం వరప్రసాద్, డిసిసిబి సిఇఒ డి.వరప్రసాద్, యుబిఐ ప్రాంతీయ మేనేజర్ బి.కె.వి.ఎస్.ఎస్ గురునాథరావు, ఆర్‌బిఐ ఎల్‌డిఒ ఎస్.అనిల్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఓటు ఆవశ్యకతను గుర్తెరగాలి

ప్రజాశక్తి - టెక్కలి

ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలని, అది తమ బాధ్యతగా భావించి, ఓటు హక్కును సద్వినియోగించుకోవాలని సబ్ కలెక్టర్ తాటిమాకుల రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కొత్త ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రక్షణ లాంటిదే ప్రజాస్వామ్య రక్షణ అని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ మాట్లాడుతూ డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఓటు వినియోగంపై అవగాహన కలిగి యుండాలని కోరారు.

ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహశీల్దార్ బెండి గిరి, డిటి వై.ఆనిల్‌కుమార్, కార్యాలయ సూపరింటెండెంట్ బి.రాజమోహన్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బేవల సతీష్‌కుమార్, కో-ఆర్డినేటర్ లూక్‌పాల్, ఆధ్యాపకులు రామారావు, శివప్రసాద్, త్రినాథరావు, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

అనుమతి ఇచ్చి నిర్బంధమా : యుటిఎఫ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం



ధర్నాకు వెళ్లవద్దని రవీంద్రకు నోటీసు ఇస్తున్న పోలీసులు

ఉద్యోగ, ఉపాధ్యాయులకు పేరుకుపోయిన ఆర్థిక సంబంధ బకాయిలు చెల్లించాలని కోరుతూ ఈనెల 30వ తేదీన రాష్ట్ర ధర్నాకు అనుమతి ఇచ్చి మరోవైపు పోలీసులతో బైండోవర్ కేసులు పెట్టించి నిర్బంధించడం టతగదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అప్పారావు ఎస్.కిషోర్ కుమార్ ఒక ప్రకటనలో విమర్శించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల జీతాల నుంచి మినహాయిస్తున్న సేవింగ్స్ నుంచి ఉద్యోగుల అవసరాల కోసం లోన్లు పెట్టుకుంటే సకాలంలో చెల్లించాలని చేసిన ప్రాతినిధ్యాలకు ప్రభుత్వం స్పందించలేదని పేర్కొన్నారు. ధర్నాకు పిలుపునిస్తే ప్రజాస్వామ్య పద్ధతిలో చర్చలకు ఆహ్వానించకపోగా, రాష్ట్ర ధర్నాకు వెళ్లనీయకుండా ఉపాధ్యాయులను అడ్డుకుంటున్న తీరు ఎలాంటి ప్రజాస్వామ్యమో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. తమ సొమ్మును తిరిగి చెల్లించడానికి ఎందుకు తాత్సారం చేస్తున్నారో సమాధానం చెప్పాలని నిలదీశారు. ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి అక్రమంగా బైండోవర్ చేయటం, కాపలాలు పెట్టడం, పాఠశాలలకు వెళ్లి నోటీసులు ఇవ్వడం సరికాదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణం బకాయిలను చెల్లించాలని, ఉపాధ్యాయులపై పెడుతున్న బైండోవర్ కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే యుటిఎఫ్ చేసే పోరాటానికి ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

ప్రజాశక్తి - పలాస

ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

జల జీవన్ మిషన్, ఉద్దానం వాటర్ ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని రాష్ట్ర మత్స్య, పశు సంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను హెచ్చరించారు. కాశీబుగ్గలోని మంత్రి కార్యాలయంలో మంగళవారం రాత్రి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల జీవన్ మిషన్, ఉద్దానం మంచి నీటి పథకం పనులు ఎంతవరకు వచ్చాయి, ఎంత శాతం పనులు జరిగాయి, ఇంకా ఎంత పని చేయాల్సి ఉంది, ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నాయా? లేదా తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే తక్షణమే పరిష్కరిస్తామన్నారు. ఇంటింటికీ కుళాయిలు నీరు సరఫరా చేసేలా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ జిఎస్.ప్రసాద్, ఇఇ జాన్‌బెహన్, డిఇలు ఆశాలత, మధు, దుర్యోధన, ఎఇలు ప్రసన్నకుమార్, రాజేష్, సతీష్‌కుమార్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM OS 10/2015

Between :
Baratam Kasirao and others
-------- Petitioners
And :
Malla Janardhana Rao and others
----- Defendants
To
Malla Saranya D/o Late Prasad Rao ,Hindu, Aged 25 years house hold duties, r/o back side of Raghavendra Textiles (cloth shop) Etcherla Street, Srikakulam.

Please take notice that the above matter is posted to **01-12-2022** for your appearance, you are hereby directed to appear before the Honourable court on **01-12-2022** without fail otherwise the matter will be decided in your absence.

BARATAM NAGESWRA RAO
ADVOCATE, SRIKAKULAM
Cell 9391380645

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

అధికారులు పనితీరు మార్చుకోవాలి

ఎమ్మెల్యే కిరణ్ కుమార్

ప్రజాశక్తి - లావేరు

అధికారులు పనితీరు మార్చుకోకపోతే అటువంటి వారిపై చర్యలు తప్పవని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ హెచ్చరించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి లుట్ట అమ్మయమ్మ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మండల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. విద్య, గృహ నిర్మాణ శాఖల అధికారుల పనితీరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు దీనిపై స్పందించిన ఎమ్మెల్యే అధికారుల దృష్టికి ప్రజాప్రతినిధులు తీసుకొచ్చిన సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో 39 ఏళ్ల క్రితం వేసిన విద్యుత్ లైన్లు మార్చాలని ఎఇని ఆదేశించారు. గోవిందపురం సర్పంచ్ పిల్లా రాము మాట్లాడుతూ పశువైద్యాధికారుల నిర్లక్ష్యంతో తన పాడి ఆవు లంపి వ్యాధితో మృతి చెందిందని సభ దృష్టికి తీసుకొచ్చారు. పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు ఏయే సరుకులు వస్తున్నాయో తమకు తెలియజేయడం లేదని వాపోయారు. గ్రామీణ తాగునీటి సరఫరా జెఇ రామారావు మాట్లాడుతూ ఇంటింటి తాగునీటి కుళాయి రెండో విడత కింద రూ.26 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పత్రాలను రైతులకు పంపిణీ చేశారు. సమావేశంలో జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, ఎంపిడిఒ విశ్వేశ్వరరావు, తహశీల్దార్ సాధు దిలీప్ చక్రవర్తి, పిఎసిఎస్ అధ్యక్షుడు బి.చిన్నారావు పాల్గొన్నారు.

బోధనను పరిశీలిస్తున్న తిరుమల చైతన్య

దీర్ఘాసి ఉన్నత పాఠశాల సందర్శన

పోలాకి : మండలంలోని దీర్ఘాసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా ఉప విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య మంగళవారం సందర్శించారు. ఈ మేరకు ఉపాధ్యాయుల పనితీరు, పాఠశాల రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే పాఠశాలకు మంజూరైన నాడు-నేడు పనులు నిర్వాహణలో చేపడుతున్న జాప్యంపై అసహనం వ్యక్తం చేశారు. వెంటనే పనులు పూర్తి చేయాలని సూచించారు. తరగతి గదిలో విద్యార్థుల మధ్యలో కూర్చుని, విద్యార్థులతో కలిసి పాఠ్యాంశ బోధనా విధానాలను పరిశీలించారు. విద్యార్థులతో సంభాషించి, వారికి చదువుపై ఉన్న ఆసక్తిని, గమనించి ప్రశంసించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జగదీశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ అసోసియేషన్‌కు ఉచిత వైద్య సేవలు

ఇచ్ఛాపురం: పట్టణంలోని బాడీ బిల్డింగ్ అసోసియేషన్ సభ్యులకు విజిల్ ఫౌండేషన్ తరుపున ఉచిత వైద్య సేవలు అందించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్, ప్రముఖ వైద్యులు డాక్టర్ వెన్నా సంతోష్ చలపాక తెలిపారు. బాడీ బిల్డింగ్ అసోసియేషన్‌లో సభ్యులు, వారి కుటుంబ సభ్యులకు అత్యవసర పరిస్థితుల్లో ఎముకలకు సంబంధించిన చికిత్స అవసరమైతే ఫౌండేషన్ ద్వారా ఉచితంగా చేస్తామన్నారు. పట్టణంలో చిన్న మేదర వీధిలో ఉన్న విజిల్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. డాక్టర్ ప్రకటనకు స్థానిక బాడీ బిల్డింగ్ అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

సోంపేట : పోటీలను ప్రారంభిస్తున్న యశోద, దాసు

ప్రజాశక్తి - సోంపేట

చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరమని, క్రీడల వల్ల మానసికోల్లాసం కలుగుతుందని జెడ్‌పిటిసి తడక యశోద అన్నారు. మండలంలోని బారువ డిగ్రీ కళాశాల ఆవరణలో మంగళవారం మండల స్థాయి గ్రిగ్స్, కబడ్డీ పోటీలను ఎంపిపి డాక్టర్ నిమ్మన దాసుతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశలో చదువుతోపాటు క్రీడలపై సైతం దృష్టి సారించాలన్నారు. క్రీడల్లో రాణించడం ద్వారా మంచి భవిష్యత్ పొందొచ్చని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం క్రీడాకారులకు ఎంతో ప్రోత్సాహకాన్ని అందజేస్తుందన్నారు. పాఠశాల స్థాయిలో జరిగే ఇటువంటి పోటీలు విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీస్తాయన్నారు. ఇటువంటి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులకు ఎర్ర రజిని, నగిరి ప్రభావతి, తడక జోగారావు, ఎంపిపి గుర్రాల శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సలీం భాష, నాయకులు రాజు, యాదవరావు, రామారావు, ఎంఇఒ జోరాడు పాల్గొన్నారు.

టెక్కలి: మండల స్థాయి గ్రిగ్స్ పోటీలు మంగళవారం సందడి వాతావరణం మధ్య ప్రారంభమయ్యాయి. మండలంలోని చాకిపల్లి, నర్సింగపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల మైదానంలో నిర్వహించారు. పోటీలను ఎంఇఒ దాసరి నాగభూషణం, నర్సింగపల్లి సర్పంచ్ రౌతు జయమోహన్ ప్రారంభించారు. నర్సింగపల్లిలో ఖోఖో సీనియర్స్, జూనియర్స్‌కి పోటీలు నిర్వహించారు. చాకిపల్లిలో కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ పోటీ తత్వం ఉండాలన్నారు. పోటీల మండల ఆర్గనైజర్ బాడాన నారాయణరావు, వ్యాయామ ఉపాధ్యాయులు కాపల రఘునాథరావు, ఆదిశేష్, జగ్గమ్మ, కుమార్, నీలయ్య, కాపల రఘునాథరావు, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రిగ్స్ పోటీలు

కవిటి: రెండు రోజులుగా కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న అంతర్ పాఠశాలల క్రీడా పోటీలు మంగళవారం సాయంత్రంతో ముగిశాయి. ఈ పోటీల్లో జూనియర్, సీనియర్ స్థాయి కబడ్డీ, వాలీబాల్ విభాగాల్లో విజేతలు జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఇఒ ధనుంజయ మజ్జి తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు జానకిరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్‌వి.రమణ, కృష్ణ పొడియ, పిఇటిలు బల్లెడ రమేష్, దీనారావు పాల్గొన్నారు.

ఆమదాలవలస : మండలంలోని తొగరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి క్రీడాకారుల పోటీలను నిర్వహించారు. సర్పంచ్ తమ్మినేని వాణిశ్రీ వాలీబాల్‌ను వేసి ఆటలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలూ అవసరమని అన్నారు. క్రీడాకారులుగా రాణించి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.కృష్ణ మాట్లాడుతూ బుధవారం కూడా క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, ఎంపిటిసి ప్రతినిధి తమ్మినేని చంద్రశేఖర్, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ కె.రాఘవాచార్యులు, స్టాఫ్ సెక్రటరీ పి.కృష్ణారావు, పాఠశాల, వ్యాయామ ఉపాధ్యాయులు బి.సురేష్ పాల్గొన్నారు.

ఆమదాలవలస : క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ వాణిశ్రీ

సంతబొమ్మాళి : మండలంలోని వడ్డివాడలో నిర్వహించిన మండల స్థాయి పాఠశాల విద్యార్థుల ఆటల పోటీల విజేతలకు బహుమతులను జెడ్‌పిటిసి పాలవసంతరెడ్డి, పిఎసిఎస్ అధ్యక్షులు కెల్లి జగన్నాయకులు, ఎంపిపి ప్రతినిధి మేరుగు రఅప్పారావు ప్రదానం చేశారు. రెండు రోజుల పాటు నిర్వహించిన ఆటలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు షీల్డ్‌లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గూట్ల మల్లేశ్వరరావు, వైసిపి ఇన్‌చార్జి పల్లి రామారావు, గోవిందపురం ఎంపిటిసి ప్రతినిధి మెండ త్రినాథ్, పిఇటిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : బహుమతులను అందజేస్తున్న నాయకులు

బంగారం షాపులో చోరీ

220 గ్రాముల బంగారం, 25 కేజీల వెండి అపహరణ

గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ సూర్యచంద్రమౌళి

కోటబొమ్మాళి: మండల కేంద్రంలోని మెయిన్‌రోడ్డు స్వామివారి సందులో ఉన్న తంగుడు నాగభూషణం బంగారం షాపులో సోమవారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. షాపు తాళాలు కోసి లోపలికి చోరపడ్డారు. 220 గ్రాముల బంగారం, 25కేజీల వెండి అపహరించుకుపోయారు. మంగళవారం విషయం తెలుసుకున్న యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం ప్రకారం... షాపు యజమాని నాగభూషణం మంగళవారం ఉదయం 9గంటలకు షాపు తెరిచేందుకు వెళ్లగా అప్పటికే తాళాలు కోసి ఉండటం చూసి పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. టెక్కలి సిఐ సూర్యచంద్రమౌళి, ఎస్ఐ షేక్‌ఖాదర్‌భాషా, సంతబొమ్మాళి ఎస్ఐ మధుసూదనరావు ఘటనా స్థలికి చేరుకొని క్ల్యూస్‌టీం, డాగ్ క్వాడ్‌ను రప్పించి సాక్ష్యాలు సేకరించారు. డాగ్ క్వాడ్ ఘటనా స్థలం నుంచి వైశ్యవీధి మీదుగా దొంగలు వెళ్లినట్లు గుర్తించింది. షాపుకు షట్టర్ లేకుండా చెక్క తలుపులు అమర్చి ఉండటం, సిసి కెమెరాలు లేకపోవడం, వీధిలో ఉన్న షాపులకు సిసి కెమెరా ఉన్నా అవి పనిచేయకపోవడం వల్ల వారి పని సులభవం తమైనట్లు తెలిపారు. పోలీసులు అనుమానితులను విచారిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలి

టెక్కలి: సమాజంలో మేధావులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, శాస్త్రీయ సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శి కుప్పిలి కామేశ్వరరావు, గొంటి గిరిధర్ కోరారు. మంగళవారం స్థానిక ఆర్‌సిఎం పాఠశాల వద్ద నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ వద్ద వారు మాట్లాడారు. ప్రజా సైన్స్ ఉద్యమ సంస్థగా జెవివి ఉందన్నారు. ఈ నాటి అంశాల్ని శోధించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం కరపత్రాల్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెవివి జిల్లా విద్యావిభాగం కన్వీనర్ పాలవలస ధర్మారావు, రాష్ట్ర కన్వీనర్ మల్లారెడ్డి పద్మనాభరావు, శ్రీనివాసరావు, ఎన్.కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

టెక్కలి: శిథిలావస్థలో ఉన్న టెక్కలి కోర్టు సముదాయాన్ని తక్షణమే మార్చేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరుతూ టెక్కలి బార్ ఆసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం ఆందోళన చేపట్టారు. విధులు బహిష్కరించి కోర్టు ఆవరణలో శిబిరం వేసి, నిరసన తెలిపారు. రోడ్డుపై మానవహారం చేపట్టారు. ప్రస్తుతం కోర్టు నిర్వహిస్తున్న భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో విధి నిర్వహణ భయంగా ఉందన్నారు. భవనం శిథిలావస్థకు చేరుకుందని, తక్షణమే భవనాలను మార్చాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. వీరికి ఇండియన్ ఆసొసియేషన్ ఆఫ్ లాయర్స్ సంఘం జిల్లా కార్యదర్శి దివ్వల వివేకానంద సంఘీ భావం ప్రకటించారు. ఈ నిరశన కార్యక్రమంలో బార్ ఆసోసియేషన్ అధ్యక్షులు ఎస్.ధర్మరాజ్, దాడి ధర్మారావు, న్యాయవాదులు వైకుంఠరావు పాణిగ్రాహి, ఖజానా వెంకటరావు, సాయిరాజ్, దవళ రాజేశ్వరరావు, పేడాడ బాబూరావు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ఆనందరావు మృతి

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఆనందరావు (ఫైల్)

మండలంలోని బెలమాంలో పోరాట నాయకుడు బెండి ఆనందరావు (91) మంగళవారం మృతి చెందారు. జిల్లాలో రైతాంగ పోరాటంలో ఆయన పాల్గొన్నారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ ఉద్యమాలు చేపట్టేవారు. తుది శ్వాస వరకు కమ్యూనిస్టు భావాలతో ఉన్నారు. గిరిజన పోరాటంలో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఇతను కనిపిస్తే కాల్చి వేయమని అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. ఆయనపై ఉన్న పలు కేసుల్లో సుమారు నాలుగేళ్ల జైలు శిక్షను అనుభవించారు. ఆనందరావు మృతి విషయాన్ని తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళ్లర్పించారు. గ్రామంలోని శ్మశానవాటికలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు.

దగ్ధమవుతున్న లారీ క్యాబిన్

తప్పిన ప్రమాదం

రణస్థలం: పెట్రోలు, డీజిల్‌తో ఉన్న పెట్రోల్ ట్యాంకర్ క్యాబిన్లో ఒక్కసారిగా మంటలు రావడం స్థానికులు స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది. మండలం కేంద్రం తాజ్ ఎంటర్‌ప్రైజస్ పెట్రోల్ బంకుకు విశాఖపట్నం నుంచి హిందుస్థాన్ పెట్రోలియం ట్యాంకరు వచ్చింది. అన్‌లోడింగ్ చేసే సమయంలో ఒక్కసారిగా క్యాబిన్‌లో ఒక్కసారిగా షార్టుసర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. ఆ సమయంలో స్థానికులు స్పందించి వారి వద్ద ఉన్న నీటితో, ఇసుకతో మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. ఎప్పటికీ మంటలు అదుపు కాకపోవడంతో రణస్థలం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందజేశారు. సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. మంటలు రాగానే లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్ కిందకు దూకేయడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అవే మంటలు పెట్రోల్, డీజిల్‌కు అంటుకుంటే పెద్ద ప్రమాదమే సంభవించేదని స్థానికులు చర్చించుకుంటున్నారు.

వృద్ధురాలికి గాయాలు

కొత్తూరు : స్థానిక కుమ్మరి వీధికి చెందిన కుమ్మరి రమణమ్మ సోమవారం రాత్రి బహిర్భూమికి వెళ్లి వెళ్లి తిరిగి రోడ్డు దాటుతుంది. ఈ సమయంలో హిరమండలం నుంచి ద్విచక్ర వాహనదారుడు వృద్ధురాలిని బలంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంతో తలకు తీవ్ర గాయమైంది. వెంటనే స్థానికులు కొత్తూరు సామాజిక ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి విశాఖ కెజిహెచ్‌కు రిఫర్ చేశారు. వృద్ధురాలి మరదలు లక్ష్మి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ గోవింద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శివాలయంలో చోరీ

టెక్కలి రూరల్: మండల కేంద్రంలోని చేరివీధిలోని శ్రీ ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయ ఆవరణలోని సిసి కెమెరాల వైర్లు ధ్వంసం చేసి దుండగులు దొంగతనానికి పాల్పడ్డారు. ఆలయంలోని సుమారు 6 కేజీల వెండి ఆభరణాలు దొంగిలించారు. ఉదయాన్నే ఈ విషయం గుర్తించిన అర్చకుడు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో టెక్కలి సిఐ సూర్యచంద్రమౌళి, ఎస్ఐ మహమ్మద్ అలీ ఆలయాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు కొల్లివలసలో వైద్య శిబిరం

బూర్జ : మండలంలోని కొల్లివలస గ్రామ కూడలి వద్ద ఉన్న స్వామి ఆస్పత్రిలో డిసెంబరు ఒకటో తేదీన ఉచిత ఎముకలు, కీళ్ల వ్యాధుల వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యులు నీలంనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. రాగోలు జేమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యాన ఆర్థోపెడిక్ సర్జన్ సునీల్ నేతృత్వంలో నిర్వహించనున్న ఈ వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


వృద్ధురాలికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

గ్రామీణులకు మెరుగైన వైద్యం

పొందూరు: గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలను అందజేసేందుకు ఏర్పాటు చేసిన ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు పి.శివశంకర్, ఎ.హేమంత్‌లు అన్నారు. మండలంలోని రాపాకలో హెల్త్‌వెల్‌నెస్ కేంద్రంలో మంగళవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మంచం పట్టిన రోగులు, గర్భిణులు, బాలింతలు, సుగర్, బిపి వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి ఇంటికి వెళ్లి ప్రత్యేకంగా వైద్య పరీక్షలను చేపట్టి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి లావణ్య, జ్యోత్స్న, ఎఎన్‌ఎంలు వనజాక్షి, ఉదయ్‌లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ రమణ, డిఇఒ శ్రీనివాసరావు, ఆశా కార్యకర్తలు శ్రీదేవి, ముత్యాలమ్మ, పుణ్యవతి, ఉషారాణి, రాజేశ్వరి, లక్ష్మి పాల్గొన్నారు.

కవిటి 104 సంచార వైద్య విధానం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు డాక్టర్ పూడి రామారావు తెలిపారు. కవిటి మండలం ప్రగడపుట్టుగ గ్రామంలో 104 వాహనం ద్వారా వైద్య సేవలు అందించారు. ఇంటి వద్ద నుంచి రాలేని పరిస్థితిలో ఉన్న రోగుల వద్దకు వెళ్లి వైద్యం అందజేశారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు మెరుగైన ఆరోగ్యం-పాటించాల్సిన నియమాలు అనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పి.పద్మ, ఆశా కార్యకర్త బి.ఇందిర, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి వద్దే రోగికి వైద్య సేవలు అందిస్తున్న రామారావు

ప్రజా సమస్యలపై పోరాడాలి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి: నిరంతరం ప్రజా క్షేత్రంలోనే ఉంటూ.. ప్రజా సమస్యలపై పోరాడాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులు, బిఎల్‌ఒలకు రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఒక్క రోజు శిక్షణా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టుగా ప్రజల్ని మభ్య పెడుతోందని, ఈ విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. ముఖ్యంగా ప్రభుత్వం పథకాల పేరుతో కుడిచేత్తో అందిస్తూ.. పన్నులు, అధిక ధరలు పేరుతో ఎడమచేత్తో లాగేసుకుంటోందని అన్నారు. దీనిపై చాలామంది సాధారణ పౌరులు సైతం అసంతృప్తితో ఉంటున్నారని, అంతేకాకుండా నిబంధనల పేరుతో చాలా పథకాల్లో కోతలు విధిస్తున్నారని అన్నారు. వీటిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, వారి సమస్యలు సావధానంగా విని, సమస్య పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అన్నింటికంటే ఆపద అంటే అందరికంటే ముందుండాలని, ప్రజల్లో మనమున్నామనే ఒక భరోసా కలిగించాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని టిడిపి ముఖ్య నాయకులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జిలు, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

'హారికా కన్‌స్ట్రక్షన్స్' మరింత అభివృద్ధి చెందాలి

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

తాను ఎంచుకున్న రంగంలో చిత్తశుద్ధితో కృషి చేసి ఉన్నత స్థాయికి ఎదిగిన మనస్తత్వం హారికాప్రసాద్‌ది అని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని సానావీధిలోని గాంధీనగర్‌లోని హారికా కన్‌స్ట్రక్షన్స్ అండ్ కన్సల్టింగ్ 13వ వార్షికోత్సవం వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్‌ను కట్ చేసి హారికాప్రసాద్ కుటుంబ సభ్యులకు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ధర్మాన మాట్లాడుతూ ఏ వృత్తిలోనైనా పట్టుదలతో క్రమశిక్షణగా ప్రయత్నిస్తే ఉత్తమ ఫలితాలు సాధించగలుగుతామని అన్నారు. అలాంటి వారి కోవకు హారికాప్రసాద్ చెందుతారన్నారు. ఈ 13 ఏళ్లలో ఎన్నో ఒడిదుడుకులు వచ్చినా నిజాయితీగా నిర్మాణదారుల నమ్మకాన్ని చూరగొనడం వల్లే హారికా కనస్ట్రక్షన్స్ అండ్ కన్సల్టింగ్ సంస్థ ఉత్తరాంధ్రాలోనే ఖ్యాతి పొందిందని అన్నారు. నగరంలో సర్యులేషన్ పాట్రన్ గురించి ఆలోచించాలని హారికాప్రసాద్ మంత్రి ధర్మానను కోరారు. వెంటనే మంత్రి స్పందించి సంబంధితశాఖ డైరెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. నగరంలోని సర్యులేషన్ పాట్రన్ అమలయ్యేలా చూస్తానని మంత్రి హామీనిచ్చారు.

ఇప్పటికే 17 ప్రాంతాల్లో సర్యులేషన్ పాట్రన్ అమలయ్యేలా నివేదికను సిద్ధం చేసినట్టు వివరించారు. భవిష్యత్‌లో హారికా కనస్ట్రక్షన్స్ అండ్ కన్సల్టింగ్ సంస్థ మరింత ఉన్నతస్థాయికి చేరుకోవాలని ధర్మాన ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, వైసిపి నాయకులు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, ఎం.వి.స్వరూప్, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు, సురంగి మోహనరావు, మండవిల్లి రవి, కాపవరపు సీజు, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు నటుకుల మోహన్, బాడాన దేవభూషణరావు, వావిలాపల్లి జగన్నాథరావు, పొన్నాడ రవికుమార్, కరణం శోభారాణి, కరణం హారిక, మౌనీష్ పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి - ఆమదాలవలస

రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ఈనెల 26 నుంచి 28 వరకు గుంటూరులో నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాకు చెందిన పలువురు వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులు జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ తరపున పోటీల్లో పాల్గొని పతకాలను సాధించారని వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కొత్తకోట శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. జిల్లా నుంచి ఈ పోటీల్లో 14 మంది పాల్గొన్నారని, వారిలో ఐదుగురు క్రీడాకారులు పథకాలను సాధించారని పేర్కొన్నారు. నరసన్నపేటకు చెందిన ఎన్.లలిత 81 కేజీల సీనియర్ విభాగంలో బంగారు పతకాన్ని సాధించారు. 59 కేజీల విభాగంలో పెద్దపాడుకు చెందిన టి. కావ్య జూనియర్ సీనియర్ విభాగాల్లో పాల్గొని మూడో స్థానంలో నిలిచి బ్రాంజ్ (రాగి) పతకాన్ని సాధించారు. అలాగే 59 కేజీల విభాగానికి సంబంధించి పెద్దపాడుకు చెందిన జి.వర్షిత సీనియర్ విభాగంలో బంగారు, జూనియర్ విభాగంలో సిల్వర్ పతకాలను సాధించింది. 45 కేజీల కేటగిరిలో డి.హేమశ్రీ జూనియర్ బ్రాంజ్ (రాగి) సీనియర్ విభాగంలో రాగి పతకాలను సాధించారు. పురుషుల అరవై ఒక్క కేజీల విభాగంలో కె.వినోద్ జూనియర్ సబ్ జూనియర్ విభాగంలో సిల్వర్ పతకాన్ని సాధించారు. పతకాలను సాధించిన క్రీడాకారులను వెయిట్ లిఫ్టింగ్ రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఇంజరాపు భాస్కరరావు, శిక్షకులు అప్పన్న, అప్పల రామయ్యలు అభినందనలు తెలియజేశారు.

పతకాలు సాధించిన క్రీడాకారులు

కవితల పోటీలో ఉపాధ్యాయుని ప్రతిభ

ప్రజాశక్తి - కవిటి

మొర్రి గోపి

మహాకవి గురజాడ వర్ధంతిని పురస్కరించుకుని గురజాడ సాంస్కృతిక సమాఖ్య(విజయనగరం) నిర్వహించిన జిల్లాస్థాయి కవితల పోటీల్లో మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు మొర్రి గోపి ప్రథమ స్థానంలో నిలిచి, సత్తా చాటారు. శ్రీకాకుళం, మన్యం జిల్లా పార్వతీపురం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల కవులు పాల్గొన్న ఈ పోటీలో మొర్రి గోపి రాసిన 'మోస బుద్ధికి వీడ్కోలు పలుకు' కవితకు ప్రథమ బహుమతి వరించింది.

ఈ సందర్భంగా నవంబర్ 30న గురజాడ కేంద్ర గ్రంథాలయం విజయనగరంలో బహుమతి ప్రదానం జరగనున్నట్లు గోపి తెలిపారు. ఉత్తరాంధ్ర గురజాడ కవితల విజేతగా నిలిచిన మొర్రి గోపికి మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి, ఉపాధ్యాయులు త్రిలోచన బిశాయి, బల్లెడ లక్ష్మణమూర్తి, కొత్తపల్లి రంగారావు, శమల్ల రాజబాబు, బల్ల ధర్మారావు, హిమకుమార్, నర్తు సోమేశ్వరరావు, సర్పంచ్ పూడి లక్ష్మణరావు, కవిటి ఉషోదయ యువజన సంఘం ప్రతినిధులు ఆరంగి మధు, పాండవ చంద్రశేఖర్, పొల్లాయి లోకనాథం, తదితరులు అభినందనలు తెలియజేశారు.

అనుమతి లేదని ర్యాలీ అడ్డగింత

టెక్కలి: బోయ, వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్‌టిలో చేర్చొద్దని, జిఒ 52ను రద్దు చేయాలని కోరుతూ ఆదివాసీ సేన ఆధ్వర్యాన మంగళవారం టెక్కలిలో ర్యాలీ చేపట్టారు. ర్యాలీకి లేకపోవడంతో పోలీసులు ర్యాలీని అడ్డుకున్నారు. టెక్కలి డివిజన్ స్థాయిలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందజేసి అనుమతి తీసుకున్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ర్యాలీకి ఏర్పాట్లు చేశారు. తాడేపల్లిలో సిఎం నివాసం వద్ద ఆందోళన నేపథ్యంలో అ నుమతలు రద్దు చేస్తున్నట్లు సిఐ నిర్వాహకులకు తెలిపారు. దీంతో వారు తాత్కాలికంగా ర్యాలీని వాయిదా వేశారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారులు

45 మందికి వైద్య పరీక్షలు

బూర్జ : మండలంలోని పాలవలస రైతు భరోసా కేంద్రం వద్ద మంగళవారం 104 సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో బూర్జ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జి.రాజశేఖర్, 104 మెడికల్ ఆఫీసర్ పి.సుధీర్‌కుమార్‌లు 45 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో డిసిఎంఎస్ సభ్యులు జల్లు బలరాంనాయుడు, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, హెల్త్ సూపర్ వైజర్ టి.తేజేశ్వరరావు, ఎఎన్‌ఎం చిన్నముడు, ఎంఎల్ హెచ్ పి.అలేఖ్య, హెల్త్ అసిస్టెంట్ కె.వెంకటరమణ, డేటా ఎంట్రీ ఆపరేటర్ నాయుడులు పాల్గొన్నారు.

'టిడిపి నాయకులను తరిమికొట్టాలి'

ఆమదాలవలస : 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' అనే కార్యక్రమంతో డిసెంబరు ఒకటి నుంచి గ్రామాల్లో పర్యటించనున్న టిడిపి నాయకులను తరిమికొట్టాలని వైసిపి నాయకులు చింతాడ రవికుమార్ ప్రజలను కోరారు. పట్టణంలోని బొడ్డేపల్లిపేటలోని జగనన్న ప్రజాసేవా కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అర్హతే ప్రామాణికంగా ఎన్నో ప్రజాకర్షక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదల బతుకుల్లో వెలుగులు నింపుతున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనను విమర్శించే నైతికహక్కు, అర్హత టిడిపి నాయకులకు లేదని అన్నారు. జగనన్నకు ప్రజల్లో వచ్చే ఆదరణను చూసి ఓర్వలేక రకరకాల వేషాలతో ప్రజల్లోకి వస్తున్నారని విమర్శించారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఏ ఒక్క సంక్షేమ పథకమూ నిజమైన అర్హులకు అందకుండా జన్మభూమి కమిటీల పేరుతో రాష్ట్ర సంపాద అంతా వారి అనుయాయులకు దోచిపెట్టారని ఆరోపించారు. సమావేశంలో వైసిపి నాయకులు కొప్పల ఈశ్వరరావు, కెప్టెన్ రామారావు, దానేటి రామమోహనరావు, గురుగుబెల్లి చక్రధరరావు, రుప్ప దుర్గారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చింతాడ రవి

కుళాయి నీటి సరఫరాను ప్రారంభిస్తున్న జగబంధు దొలాయి

ఇంటింటికీ తాగునీరు

కంచిలి: పంచాయతీలోని ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా పనులు చేస్తున్నామని తలతంపర పంచాయతీ సర్పంచ్ డాక్టర్ జగబంధు దొలాయి అన్నారు. మంగళవారం గ్రామంలోని మండపం వీధి, కిల్లా వీధుల్లో ఇంటింటికీ కుళాయి ద్వారా నీటిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుద్ధ జలం తాగడం వల్ల కిడ్నీ సమస్యలు, ఇతర ఆరోగ్యపరమైన ఇబ్బందులు రావన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి బృందావన్ సాహూ, గ్రామ పెద్దలు కురా, మోహన్ మజ్జి, తదితరులు పాల్గొన్నారు.

బహుమతిని అందజేస్తున్న సన్యాసినాయుడు

రాజ్యాంగ పరిధిలోనే హక్కుల పరిరక్షణ

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాజ్యాంగం పరిధిలోనే హక్కుల పరిరక్షణకు అనేక చట్టాలు రూపొందించారని, వాటిద్వారా పౌరులు తమ హక్కులను పరిరక్షించుకోవచ్చునని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. రాజ్యాంగ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా నగరంలోని బలగ హైస్కూల్‌లో న్యాయ అవగాహనా సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు చిత్రలేఖన, వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ భారత రాజ్యాంగం చట్టాలకు మూలమన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, బాధ్యతలను రాజ్యాంగం కల్పించిందని గుర్తుచేశారు. న్యాయం పొందడానికి కుల, మత, వర్గ, లింగ, పేద, ధనిక తారతమ్యాలు లేవన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ, ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం న్యాయవాది ఇందిరాప్రసాద్ పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ గిరిబాబు

గ్రామీణ ప్రాంతాలకు తారు రోడ్డు

మున్సిపల్ చైర్మన్ గిరిబాబు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ తారు రోడ్లు నిర్మిస్తున్నామని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డ్ పెసరపాడులో చిన్నబాడం హైవే నుండి పెసరపాడు గ్రామానికి 15వ ఆర్థిక సహాయం, మున్సిపల్ జనరల్ ఫండ్ రూ.32 లక్షల వ్యయంతో తారు రోడ్డు నిర్మాణానికి మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి సీదిరి అప్పలరాజు సహకారంతో తారు రోడ్డు వేస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో పెసరపాడు గ్రామానికి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామన్నారు. 15 రోజుల్లో రోడ్డు పూర్తి చేసి ఆ గ్రామానికి కానుక ఇస్తామన్నారు. ఎమ్మెల్యే, మున్సిపల్ ఎన్నికల్లో ఓట్లు వేసి గెలిపించినందుకు రోడ్డు నిర్మించి, రుణం తీర్చుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కో- ఆప్షన్ సభ్యులు రోణంకి శ్రీనివాసరావు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ధనుంజయ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీరు

శాసనసభ స్పీకర్ సీతారాం

బూర్జ: అన్ని గ్రామాల్లోని ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని లక్కుపురం పంచాయతీ పనుకుపర్త, లక్కుపురం గ్రామాల్లో రూ.87 లక్షల నిధులతో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీటి కుళాయి ఏర్పాటుకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనాభాకు సరిపడ నీటి వనరులను సృష్టించే దిశగా అధ్యయనాలు సాగుతున్నాయని అన్నారు. రానున్న రోజుల్లో సత్ఫలితాలు ఇస్తాయని పేర్కొన్నారు. సిఎం జగన్ గ్రామీణ ప్రాంతాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. అనంతరం లక్కుపురం మండల పరిషత్ పాఠశాలలను సందర్శించారు. అనంతరం స్పీకర్, ఎంపిపి విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఆశా కార్యకర్తను నియమించాలి

తమ గ్రామానికి ఆశా కార్యకర్తను నియమించాలని చిన్ని రాజేశ్వరి స్పీకర్‌ను కోరారు. ఆశా కార్యకర్త లేకపోవడంతో

భోజనం రుచి చూస్తున్న స్పీకర్ సీతారాం

గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అలాగే తమ గ్రామానికి సరైన రహదారి లే అవస్థలు పడుతున్నామని చిన్ని లక్ష్మి స్పీకర్ దృష్టికి తీసుకొచ్చారు. స్పీకర్ స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

వాసు కుటుంబాన్ని పరామర్శ

ఎంపిపి దీప కుటుంబ సభ్యులు కర్నేన వాసు కుమారుడు కృష్ణకాంత్ ఇటీవల సంభవించిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న స్పీకర్ ఇంటికి వెళ్లి కృష్ణకాంత్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపిపి కర్నేన దీప, జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, డిసిఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాంనాయుడు, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాంప్రసాద్, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు గుమ్మడి రాంబాబు, మండల ప్రత్యేకాహ్వానితులు నాగేశ్వరరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఆమదాలవలస: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ మూడేళ్లలో ప్రతి గ్రామంలోనూ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బొడ్డేపల్లి రమేష్‌కుమార్, అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, దుంపల శ్యామలరావు, ఎండా విశ్వనాథం, సనపల సురేష్, మామిడి రమేష్‌కుమార్, బొడ్డేపల్లి రమణమూర్తి పాల్గొన్నారు.

అబ్బురపరిచిన సైన్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి- టెక్కలి

స్థానిక ఆర్‌సిఎం మిషనరీ పాఠశాలలో మంగళవారం జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. జాతీయ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన జిల్లా సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. జిల్లాలోని వివిధ యాజామాన్యాల పరిధిలోని 200 పాఠశాలల నుంచి హాజరైన విద్యార్థులు 237 ప్రాజెక్టులను ప్రదర్శించారు. వీటిలో అధికశాతం ప్రాజెక్టులు పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ, ప్లాస్టిక్ నిర్మూలన, మధుమేహ వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన ఆహారం, చిరిధాన్యాలతో ఆరోగ్యం ఎంతో మేలు వంటి అంశాలతో కూడిన ప్రాజెక్టులు అధికంగా ప్రదర్శించబడ్డాయి. డైట్ కళాశాల ప్రిన్సిపాల్ తిరుమలచైతన్య, విశ్రాంత ఉపాధ్యాయులు కొత్తకోట అప్పారావు ప్రదర్శనలను తిలకించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను, వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకశక్తిని వెలికి తీయడానికి ఇటువంటి పోటీలు అవసరమని, ఆరోగ్యకరమైన పోటీ విద్యార్థుల్లో ఉండాలన్నారు. భవిష్యత్ తరాలవారికి సైన్స్ ఆవశ్యకతను వివరించాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయ నిర్ణేతలు ఐదు బృందాలుగా వీడి ప్రదర్శనలను తిలకించారు. పోటీల్లో టెక్కలి డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి కార్యాలయ నుంచి భాస్కరరావు, కుప్పిలి నగేష్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాలను అందజేస్తున్న తిరుమల చైతన్య

వినతిపత్రం అందజేస్తున్న అప్పలనాయుడు

ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలి

రణస్థలం: ఎచ్చెర్ల, రణస్థలం మండలాలకు సంబంధించి తీర ప్రాంతంలో ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకుండా ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని, హోంగార్డులతో గస్తీ నిర్వహించాలని టిడిపి సీనియర్ నాయకులు, పొందూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. ఈ మేరకు విశాఖపట్నం మెరైన్ అడిషనల్ సూపరెంటెండెంట్ వి.బి.ఆర్.మధుసూదనరావుని ఆయన కార్యాలయంలో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎచ్చెర్ల నియోజకవర్గం పరిధిలోని రణస్థలం, ఎచ్చర్ల మండలాల్లోని సముద్ర తీరా ప్రాంతంలో ఇటీవల కాలంలో చాలా మంది యువత సముద్ర తీరానికి విహారయాత్రలకు వెళ్లి అందులో మునిగిపోతున్నారని అన్నారు. ఇటీవల లావేరు మండలం అగ్రహారానికి చెందిన కలమట ప్రసాద్ అనే బాలుడు సముద్రంలో గల్లంతయ్యాడని, ఇప్పటికీ ఆచూకీ లభించలేదని అన్నారు. తీర ప్రాంతంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే హోంగార్డులను గస్తీ నిర్వహించాలని కోరారు. దీనిపై స్పందించిన ఎఎస్‌పి స్పందించి ఆ బాధ్యతలను డిఎస్‌పి గోవిందరాజుకు అప్పగించారు.

లైట్లు వితరణగా అందజేస్తున్న కృష్ణచైతన్య

క్రీడా మైదానానికి లైట్లు వితరణ

ప్రజాశక్తి- నరసన్నపేట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానానికి పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణదాస్ లైట్లు వితరణగా అందజేశారు. రెండు రోజుల క్రితం కళాశాల మైదానాన్ని ఆయన పరిశీలించారు. క్రీడాకారులు మైదానంలో లైట్లు ఏర్పాటు చేయాలని ఆయనను కోరడంతో స్పందించిన ఆయన మంగళవారం లైట్లను సమకూర్చారు. సర్పంచ్ బూరెల్లా శంకర్ ఆధ్వర్యంలో లైట్లు అందించారు. అనంతరం వార్డు మెంబర్ పొట్నూరు కృష్ణప్రసాద్ ఔదార్యంతో ఫ్రీజర్, శవపేటికను కృష్ణ చైతన్య పంచాయతీ కార్యాలయానికి అందించారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ కోరాడ చంద్రభూషణ గుప్త, ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, వార్డు సభ్యులు గనగళ్ల శ్రీనివాసరావు, నేతింటి సింహాచలం, రఘుపాత్రుని శ్రీధర్, ఎంపిటిసి నేతింటి రాజేశ్వరరావు, మండల కో-ఆప్షన్ రమణ సాహు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో మెరిసిన ప్రియ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నృత్యం చేస్తున్న ప్రియ

ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా అంతర్జాతీయ ఫోరం ఆఫ్ ఆర్ట్స్ అండ్ కల్చరల్ ఆధ్వర్యాన బెంగుళూరులో నిర్వహించిన 'జాన్ క్రితి-22' జాతీయ స్థాయి కూచిపూడి విభాగం (8-12) సంవత్సరాల పోటీల్లో కొమ్ము చేతనప్రియ ప్రథమ స్థానం దక్కించుకుంది. నగరంలోని శివశ్రీ నృత్య నికేతన్ డైరెక్టర్ డాక్టర్ శ్రీకాంత్ రఘుపాత్రుని వద్ద ఆమె శిక్షణ పొందుతున్నారు. పద్మభూషణ్ అవార్డు గ్రహీత పద్మాసుబ్రహ్మణ్యం, నాట్యం మూవీ హీరోయిన్ సంధ్యారాణి, వనజా ఉదయ్ న్యాయ నిర్ణేతల సమక్షంలో ఆమె ఎంపికయ్యారు. బెంగుళూరులోని 'వేద విజ్ఞాన్ మహా విద్యా పీఠం'లో వచ్చే ఏడాది జనవరి 26,27,28 తేదీల్లో భారత సాంస్కృతికశాఖ మంత్రి గురుదేవ్ శంకర్ చేతుల మీదుగా ఈ బహుమతిని అందుకోనున్నట్టు శ్రీకాంత్ తెలిపారు.

ఆస్పత్రి రోడ్డు కోసం స్థల పరిశీలన చేస్తున్న సుగుణాకరరావు

లేఅవుట్‌ను సిద్ధం చేయాలి

ప్రజాశక్తి- పలాస

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న స్మార్ట్ టైన్‌షిప్ లే అవుట్‌ను త్వరితగతిన సిద్ధం చేయాలని మున్సిపల్ ఇఇ సుగుణాకరరావు మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. మండలంలోని బొడ్డపాడు రెవెన్యూ పరిధిలో ఉన్న జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌కు కొనుగోలు చేసిన స్థలాన్ని, కిడ్నీ రీసెర్చ్ సెంటర్ భవనానికి రోడ్డు నిర్మాణం కోసం స్థలాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 150 ఎకరాలను కూడా చదును చేసి ప్లాట్లుగా విభజించాలన్నారు. రాళ్ల పాతి ఏ స్థలానికి ఆ స్థలం అమ్మకానికి సిద్ధం చేయాలన్నారు. కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల ఆస్పత్రికి రోడ్డు వేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఆయనతో పాటు మున్సిపల్ కమిషనర్ టి.రాజగోపాల్ మున్సిపల్ డిఇఇ బళ్ల హరి, మున్సిపల్ ఎఇఇ అవినాష్, తదితరులు ఉన్నారు.

టాక్సీ ఓనర్స్, డ్రైవర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

టాక్సీ ఓనర్స్, డ్రైవర్స్ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి- నరసన్నపేట

జై దుర్గా భవాని టాక్సీ ఓనర్స్, డ్రైవర్స్ యూనియన్ నూతన కార్యవర్గ ఎన్నికలు మంగళవారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ప్రెసిడెంట్‌గా ఎస్.వెంకటరమణ వైస్ ప్రెసిడెంట్‌గా కరణం రాజు, కార్యదర్శిగా ముద్దాడ గోవిందరావు, సహాయ కార్యదర్శిగా పిలక మురళి, కోశాధికారిగా చింత సూర్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నిక అనంతరం నూతన కార్యవర్గాన్ని ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం మాట్లాడుతూ టాక్సీ ఓనర్స్, డ్రైవర్స్ అభివృద్ధి కోసం కష్టపడి పని చేస్తామన్నారు. తమకి ఈ చక్కని అవకాశం ఇచ్చిన అందరికీ పేరుపేరున కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు టాక్సీ ఓనర్స్, డ్రైవర్ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న మధుసూదనరావు

విపత్తుల నుంచి రక్షణపై అవగాహన

టెక్కలి రూరల్: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు టెక్కలి అగ్నిమాపక సిబ్బంది విపత్తులు, ప్రమాద పరిస్థితుల్లో చిక్కుకున్న వారికి ప్రాణరక్షణ చేసేందుకు కావాల్సిన ప్రాథమిక చర్యల గురించి వివరించారు. మంగళవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహనా సదస్సులో లీడింగ్ ఫైర్మెన్ కె.మధుసూదనరావు, ఫైర్మెన్ కె.రాములు పాల్గొని విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. ప్రత్యక్షంగా విద్యార్థులు పాల్గొనేలా చేశారు. అగ్ని ప్రమాదం సంభవించినపుడు, తుపాన్లు, భూకంపాలు వచ్చినపుడు ప్రాణాపాయ స్థితినుండి ప్రమాదంలో చిక్కుకున్న వారిని ఎలా కాపాడాలన్న విషయాలను తెలియజేశారు. ఐతమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ డాక్టర్ డి. విష్ణుమూర్తి, బలరాం కృషిని అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జీవితంలో ఉపయోగపడే ఇటువంటి చైతన్య సదస్సులు మరిన్ని నిర్వహించాలని సూచించారు. అధ్యాపకుడు అట్టాడ రాజేష్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించాలి

ఇచ్ఛాపురం: మన రాజ్యాంగాన్ని మనమే పరిరక్షించాలని, విద్యార్థి దశ నుంచే ఆ దిశగా అడుగులు వేయాలని మండల మేజిస్ట్రేట్ రవిశంకర్ అన్నారు. రాజ్యాంగ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం దేశాన్ని నడిపించే మార్గదర్శి అని అన్నారు. ఉన్నత భావాలను అలవర్చుకుని దేశ సార్వభౌమత్వాన్ని రక్షించాలన్నారు.

ఆకట్టున్న నమూనా అసెంబ్లీ

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం డివి.త్రినాథరావు, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుల

నమూనా అసెంబ్లీని నిర్వహిస్తున్న విద్యార్థులు

ఆధ్వర్యంలో విద్యార్థులు నమూనా అసెంబ్లీని నిర్వహించారు. ఇది ఎంతగానో ఆకట్టుకుంది. విద్యార్థులు చక్కగా పాల్గొని ప్రశ్నలు అడిగిన తీరు, దానికి అధికార పక్షం సమాధానాలు చెప్పడం, స్పీకర్ సమన్వయపర్చడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో ఎస్ఐ గోవిందరావు, ఎంఇఒ కె.అప్పా రావు, ఇచ్ఛాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

'చేయూత'ను సద్వినియోగించుకోవాలి

సోంపేట: వైఎస్ఆర్ చేయూత పథకాన్ని అర్హులైన మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పలాసపురం సర్పంచ్ తడక జోగారావు కోరారు. మంగళవారం పలాసపురం సచివాలయం వద్ద చేయూత మూడో విడత కార్యక్రమాన్ని ప్రారం భించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన మహిళలు ఇంటి వద్ద మేకలు, గొర్రెలు, ఆవులు పెంచడం ద్వారా ఉపాధి పొందవచ్చ న్నారు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక స్వాలంబన సాధించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కామేశ్వరరావు, పశువైద్యాధికారి సునీత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

టెక్కలి రూరల్ : రాజ్యాంగ దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా మంగళవారం టెక్కలి సమీకృత బాలికల వసతి గృహంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు మండల న్యాయసేవా సంఘం టెక్కలి ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులు ప్రాథమిక హక్కులు, విధులు, బాల్య వివాహ నిషేధ అంశాలపై వ్యాసాలను రాశారు. బాల్యవివాహ నిషేధంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. న్యాయ సేవా సంఘం మండల అధ్యక్షులు, సీనియర్ సివిల్ జడ్జి టి.హరిత, జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌హెచ్ఆర్ తేజ చక్రవర్తి విజేతలను ఎంపిక చేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ విజేతలకు న్యాయమూర్తులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హాస్టల్ సంక్షేమ అధికారి జి.వి.విజయలక్ష్మీ పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే ఎయిడ్స్ నియంత్రణ

కొత్తూరు : జాగ్రత్తలతోనే ఎయిడ్స్, హెచ్ఐవి వ్యాధులను నియంత్రించగలమని ఐసిటిసి కౌన్సలర్ చింతాడ భాస్కరరావు అన్నారు. మండలంలోని బలదలో ఎయిడ్స్‌పై జాగ్రత్తలు-నివారణ మార్గాలపై మంగళవారం అవగాహన కల్పించారు. గర్భిణులు తప్పనిసరిగా ఎయిడ్స్, హెచ్ఐవి పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సారిపల్లి భారతి, వైసిపి మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, తిరుపతిరావు, ఆయుష్ వైద్యులు పూజారి, పురుషోత్తం, సూపర్‌వైజరు ప్రసాదరావు, వైద్య సిబ్బంది మాలతి పావని, సృజన, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శివారు గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన

కోటబొమ్మాళి: పంచాయతీ పరిధిలోని శివారు గ్రామాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించటమే ప్రభుత్వ లక్ష్యమని, గత పాలకులు శివారు గ్రామాలకు పట్టించుకోనేవారు కాదని చీపుర్లపాడు పంచాయతీ సర్పంచ్ నేతింటి అప్పలస్వామి అన్నారు. మంగళవారం నూతనంగా నిర్మించబోయే డ్రైనేజీ పనులను ఆయన ప్రారంభించారు. చీపుర్లపాడు పంచాయతీ పరిధిలోని శివారు గ్రామమైన దుర్గంపేటలో కాలువల్లేక ప్రజల ఇళ్ల ముందే మురుగునీరు నిల్వ ఉంటోందని, ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని అన్నారు. గ్రామస్తుల కోరిక మేరకు కాలువలు, సిసి రోడ్లు, తాగునీటి వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. నాయకులు నెయ్యిల సురేష్, షణ్ముఖరావు పాల్గొన్నారు.

ఇళ్లు ఎక్కడ కట్టాలి?

ప్రజాశక్తి- పలాస

పలాస మండలం రెంటికోట గ్రామంలో జగనన్న ఇళ్ల పట్టాలు ఇచ్చారు కానీ, వివాదాస్పదమైన స్థలం కేటాయించడంతో తాము గృహ నిర్మాణాలు చేపట్టలేకపోతున్నామని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. రెంటికోట పంచాయతీ పరిధిలో ఉన్న లబ్ధిదారులకు కంట్రగడ రెవిన్యూ పరిధిలో సర్వే నెంబర్ 59/1ఎ లో జగనన్న ఇళ్ల కాలనీలో పట్టాలు మంజూరు చేశారని అన్నారు. కేటాయించిన స్థలానికి వెళ్లి నిర్మాణం చేపడితే కంట్రగడ గ్రామానికి చెందిన ఓ మహిళ మా భూమిలో మీరు ఇళ్ల నిర్మాణం ఎలా చేపడుతారంటూ నిలదీయడంతో పనులు ఆపేశామన్నారు. వివాదాస్పదమైన భూముల్లో కేటాయించిన పట్టాలను రద్దు చేసి రెంటికోట గ్రామంలో స్థలాలు కేటాయించాలని కోరారు. ఈ విషయమై ఇప్పటికే ఆర్‌డిఒ, తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదన్నారు. కార్యక్రమంలో జి.కుమారి, డి.రాజేశ్వరి, పి.మేనక, పి.జ్యోతి, బి.పార్వతి, రాజన్న సుకుమారి, రౌత్య జమున, సుష్మ మహారాణ, ప్రఫుల్ల మహారాణ, యశోద మంత్ర, సూర్యప్రభ మహారాణ, కె భాగ్యవతి, ఎం.చంద్రమ, మండ్య రంభ, బి.రేణుక, కె.నారాయణమ్మ, కాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ఇచ్ఛాపురం: మండలంలోని కొఠారి గ్రామ పంచాయతీ పత్రిపుట్టుక గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదంలో బదకల సాయమ్మ పూరిల్లు దగ్ధమైన విషయం తెలిసిందే. జనసేన నియోజకవర్గ నేత లోల్లా రాజేష్ బాధితురాలికి మంగళవారం నిత్యావసర సరుకులు అందించారు. ప్రభుత్వ పరంగా రావాల్సిన సహాయం అందేలా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో జన సైనికులు మహేష్, శ్రీకాంత్, పథ్వి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న జయరాం

ఇసుక మేటలు పరిశీలన

కొత్తూరు : మండలంలోని కుంటిభద్ర వద్ద ఉన్న వంశధార నదీ పరిహారం కింద ఉన్న పంటల పొలాల్లో ఆగస్టులో సంభవించిన వంశధార వరదకు ఇసుక మేటలు వేశాయి. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. విషయాన్ని తెలుసుకున్న సర్పంచ్ ప్రతినిధి అగతముడి రంజిత్‌కుమార్ కొద్ది రోజుల క్రితం కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌కు, డ్వామా పీడీలకు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ స్పందించి కలెక్టర్ అడిషనల్ పీడీ జయరాంను పంపించారు. దీంతో మంగళవారం ఇసుక మేటల పంట పొలాలను పరిశీలించారు. పొలాల్లో ఉన్న ఇసుకను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని సర్పంచ్ ప్రతినిధికి హామీనిచ్చారు. ఈయన వెంట ఇసి శ్రావణి, టిఎ రమణ, ఫీల్ట్ అసిస్టెంట్ షణ్ముఖరావులు ఉన్నారు.

సంపాదిత సెలవు బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి- పొందూరు

ఉపాధ్యాయులు గత 20 నెలల కిందట పెట్టిన సంపాదిత సెలవుల బిల్లులు తక్షణమే చెల్లించాలని డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కొమ్ము అప్పలరాజు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండలంలోని లైదాం ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన డిటిఎఫ్ కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులకు సంవత్సరానికి కేవలం ఆరు రోజులు మాత్రమే నగదుగా మార్చుకునే అవకాశం ఉందని, ఈ సెలవులకు సంబంధించి ఉపాధ్యాయులు పెట్టిన బిల్లులు సుమారు రెండేళ్లుగా ఎదురు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ అవసరాలకు ఉద్యోగులు ఇఎల్, పిఎఫ్, ఎపిజిఎల్ఐ వంటి వాటి నుంచి నగదు పొందడానికి బిల్లులు పెడతారని, అవీ చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. సమస్యలపై

మాట్లాడుతున్న అప్పలరాజు

ప్రశ్నిస్తే కాళ్లు పట్టుకుని బతిమాలాడాలని బెదిరింపులకు పాల్పడడం సరికాదన్నారు. డిటిఎఫ్ జిల్లా కార్యదర్శులు గురుగుబెల్లి గోపాలరావు, పూజారి హరిప్రసన్న మాట్లాడుతూ అకారణంగా ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ పొందూరు మండల ప్రధాన కార్యదర్శి సీపాన భాస్కరరావు, అధ్యక్షులు బలివాడ వెంకటేశ్వర్లు, గన్నెం రామారావు, జి.భాస్కరరావు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లకు అండ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆరోగ్య సమస్యలతో పాటు మానసిక, శారీరక ఒత్తిళ్లతో బాధపడుతున్న సీనియర్ సిటిజన్లకు సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎల్లప్పుడూ అండగా నిలవాలని గౌరవ సలహాదారు పి.జగన్మోహనరావు సూచించారు. నగరంలోని సి.వి.నాగజ్యోతి ఆనంద నిలయంలో మంగళవారం అసోసియేషన్ అధ్యక్షులు బి.మల్లేశ్వరరావు అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృద్ధాప్యంలో అనేక మందికి అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని, వాటిని అధిగమించడానికి తగిన జాగ్రత్తలు పాటించాలని అన్నారు. మానసికంగా ఉల్లాసంతో ఉన్నప్పుడు అనారోగ్య సమస్యలు దరి చేరకుండా ఉంటాయన్నారు. తగిన వ్యాయామం, సకాలంలో భోజనం, ఒత్తిళ్లను తగ్గించుకునేందుకు పుస్తక పఠనం వంటి మంచి అలవాట్లు పెంచుకోవాలని అన్నారు. ఈ నెల 19న మైసూర్‌లో నిర్వహించిన ఆల్ ఇండియా సీనియర్ సిటిజన్ల కాన్ఫరెన్స్‌కు హాజరై వచ్చిన సెంట్రల్ కౌన్సిల్ మెంబరు

మాట్లాడుతున్న జగన్మోహనరావు

ఎం.ఎస్.ఆర్.ఎస్.ప్రకాష్‌రావు, నరసింహమూర్తి పాల్గొని అక్కడి చర్చల సారాంశాన్ని సభ్యులకు వివరించారు. సమావేశంలో సోమసుందరరావు, ప్రసాదరావు, బి.ముత్యాలమ్మ, నిక్కు అప్పన్న, బి.జయలక్ష్మి, సిహెచ్.చిన్నయరావు, డి.వి.ఎన్.సోమేష్ పాల్గొన్నారు.

స్టాపర్లను ఏర్పాటు చేస్తున్న పోలీసులు

స్టాపర్స్‌తో వేగ నియంత్రణ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్టాపర్స్‌తో వేగాన్ని నియంత్రించొచ్చని, తద్వారా ప్రమాదాలు సంభవించవని సిఐ సతీష్‌కుమార్ అన్నారు. పట్టణంలోని అమ్మవారు ఆలయం సమీపంలోని అర్చి వద్ద తరుచూ వాహన ప్రమాదాలు జరగడంతో స్పందించిన పోలీస్ అధికారులు స్టాపర్స్ ఏర్పాటు చేశారు. స్థానిక జ్ఞానభారతి విద్యా సంస్థల సహకారంతో అందించిన రెండు స్టాప్ బోర్డులు మంగళవారం ఏర్పాటు చేశారు. సిఐ సతీష్‌కుమార్, పట్టణ ఎస్ఐ.గోవిందరావు వీటిని ప్రారంభించారు. దీని వల్ల వాహనాల వేగ నియంత్రణ జరిగి ప్రమాదాలు కొంతవరకు నియంత్రించవచ్చు అని పోలీస్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జ్ఞాన భారతి విద్యా సంస్థల కార్యదర్శి జోహార్ ఖాన్, ప్రిన్సిపాల్ ఐబి.పండా, ట్రస్టీ రమణమూర్తి, ఎఐ ప్రేమ్ సర్తాజ్‌ఖాన్, ప్రమోద్, విద్యాశాఖ సిబ్బంది కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాల్గొన్న అమ్మోజి, కరుణ్‌కుమార్

'కథా ఉత్సవం'లో జిల్లావాసులు

రణస్థలం: హైదరాబాద్ శామీర్‌పేట్ పరిసరాల్లోని 'ల్యాండ్ ఆఫ్ లవ్' రిసార్ట్‌లో ఈ నెల 26, 27వ తేదీల్లో నిర్వహించిన 'శీతాకాల కథా ఉత్సవం-22' మంగళవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో జిల్లాలోని పలాసకు చెందిన శ్రీదేవి సోడా సెంటర్, పలాస, అందరూ కళాకారులే సినిమాల డైరెక్టర్ కరుణ్ కుమార్, టెక్కలి మండలం పోలవరానికి చెందిన బమ్మిడి అమ్మోజి పాల్గొన్నారు. అమ్మోజి మండలంలోని కోష్ట సచివాలయంలో మహిళా పోలీస్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 'అమ్మూ'కలం పేరుతో రచనలు చేస్తున్నారు.

నియామక పత్రాలు అందజేత

ఇచ్ఛాపురం: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన పెంచుకొని ప్రజలకు మంచి సేవలు అందించాలని కొత్తగా నియామకమైన వాలంటీర్లకు ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం కొత్తగా ఎంపికైన నలుగురు వాలంటీర్లకు నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా వాలంటీర్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు నర్తు ప్రేమ్‌కుమార్, వివేకానందరెడ్డి, కె.మోహనరావు, చిట్టిబాబు, కృష్ణారెడ్డి, విఆర్ఒ రాజారెడ్డి, కేదారి పాల్గొన్నారు.